4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 12 మార్చి 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# దాహం దాహం

**కర్ణాటకలోని** పలు ప్రాంతాలు కరవు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా రాజధాని నగరమైన బెంగళూరు కనీవినీ ఎరుగని తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. ఫలితంగా ఐటీ నగరంలో రోజువారీ జీవితం దుర్భరంగా మారింది. గత ఏడాది వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోయి, 50 శాతం బోరు బావులు ఎండిపోయాయి. సాక్షాత్తూ ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇంట్లోని బోరే బోసిపోవడం వార్తలకెక్కింది. బెంగళూరు మహా నగరం పరిధిలోని అనేక తాలూకాల్లో కరవు పరిస్థితులు ఏర్పడినట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీటిని పరిమితంగా ఉదయం పూట కొద్దిసేపు మాత్రమే వదులుతున్న అధికార యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసింది. మరో వైపు ఇదే అవకాశమని ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు ప్రజలను ఎడా పెడా దోచుకుంటున్నారు. ట్యాంకర్ల నీటి సరఫరా మీదే ఎక్కువగా ఆధారపడే దవాఖానలపై దీనివల్ల అదనపు భారం పడుతున్నది.

భారత సిలికాన్ వ్యాలీగా ప్రసిద్ధి పొందిన బెంగళూరు నుంచి టెకీలు నీటిగోస తట్టుకోలేక పెద్ద ఎత్తున స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. నగర ఐటీ కంపెనీల్లో మరోసారి 'వర్క్ ఫ్రం హోం' విధానం తెరమీదికి వస్తున్నది. ఐటీ పరిశ్రమలో ఇంటివద్ద పని అనేది తప్పనిసరి చేయాలనే డిమాండ్ వినవస్తున్నది. అలాగే విద్యాసంస్థల్లోనూ ఆన్‌లైన్ బోధన తప్పనిసరి చేయాలనే విజ్ఞాపనలూ ప్రభుత్వానికి అందుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా నీటి ఎద్దడి ప్రభావం పడింది. నీటి కొరత భయంతో చాలా మంది కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు. ప్రస్తుతం కర్ణాటకలో ఎదురవుతున్న నీటిఎద్దడికి ఎల్‌నినో ప్రభావం కారణమని వాతావరణ నిపుణులు సెలవిస్తున్నారు. దీనివల్ల పోయిన ఏడాది వర్షపాతంలో లోటు నమోదైంది. ఈ ఏడాది వేసవి కూడా మామూలు సమయం కంటే ముందే వచ్చింది. ఈసారి ఎండల తీవ్రత ఎక్కువే ఉంటుందని, వర్షపాతం అంతంత మాత్రంగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. మూడునాలుగు దశాబ్దాల్లో ఇంతటి నీటి సమస్య ఎప్పుడూ రాలేదంటున్నారు. బెంగళూరుకు నీటిని సరఫరా చేసే మాండ్యాలోని కృష్ణరాజసాగర్ జలాశయంలో నీరు అడుగంటడంతో నగరం పరిస్థితి దయనీయంగా తయారైంది.

కరవు నేపథ్యంలో కృష్ణరాజసాగర్ నుంచి తమిళనాడుకు కావేరీ జలాలను విడుదల చేసే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేయడం గమనార్హం. ఈ వివాదం రెండు రాష్ర్టాల మధ్య తాజాగా చిచ్చు పెడుతున్నది. నీటి కరవు ప్రభుత్వ యంత్రాంగానికి, పౌరులకూ మధ్య కూడా ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. వాహనాలు కడగడం, చెట్లకు పోయడం వంటి అత్యవసరం కాని పనులకు నీటిని వినియోగించడంపై అధికారులు నియంత్రణలు విధించారు. అలా చేసిన వారికి రూ. 5 వేల జరిమానా విధించనున్నట్టు బెంగళూరు నీటి సరఫరా బోర్డు ఆదేశాలు జారీ చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. ఈ నిబంధన అమలుపై సందేహాలు, నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కొత్తగా వేసే బోర్లకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి అని కూడా మరో నిబంధన అమల్లోకి వచ్చింది. ప్రస్తుత బెంగళూరు నగర దుస్థితికి ప్రకృతి ప్రకోపం, మానవ కృషి లోపం రెండూ కారణమేనని చెప్పాలి. ఆ రాష్ట్ర పాలకుల్లో దీర్ఘకాలిక వ్యూహం కొరవడటం ప్రజలకు శాపంగా మారింది. నీటి సరఫరా వంటి మౌలిక వసతులను పట్టించుకోకుండా నగరాలను విస్తరించుకుంటూపోతే ఎదురయ్యే విపత్తులకు బెంగళూరు పరిస్థితి అద్దం పడుతున్నది. మహా నగరాల ప్రణాళికా కర్తలకు బెంగళూరు అనుభవం ఓ కనువిప్పు కాగలదని భావించవచ్చు.

# తిరిగి అదే మైదానం నుంచి..

వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం ఈ నెల 12న కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో జరిగే బీఆర్ఎస్ మొదటి సభ ప్రజాక్షేత్రంలో పార్టీ పునరుజ్జీవనానికి నాంది పలకగలదని భావించవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో కొంత వెనుకబాటుకు గురైన పార్టీకి ఈ స్వల్పకాలంలోనే ప్రజల్లో తిరిగి ఆదరణ పెరుగుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకు మొదటి కారణం, కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీల అమలులో తడబడుతున్నదనే భావన ప్రజల్లో క్రమంగా ఏర్పడుతుండటం కాగా, రెండవది ఈ మూడు నెలల కాలంలో అసెంబ్లీలో, బయట కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ విమర్శలకు, ఆరోపణలకు సమర్థవంతంగా జవాబులిచ్చి అధికార పక్షాన్నే ప్రజల దృష్టిలో పలచన చేయగలగటం. మూడవది, పార్టీ ఓటమికి కారణాలను, సంస్థ బలోపేతానికి సూచనలను విస్తృతమైన సమీక్షల ద్వారా కనుగొని అందుకు అనుగుణంగా తగిన కార్యాచరణకు సంసిద్ధులు కావటం. నాల్గవది, కేసీఆర్ నాయకత్వ స్థాయికి, ప్రతిష్ఠకు సరిపోగల నాయకుడెవరూ ఇతర పార్టీలలో నేటికీ కనిపించటం లేదన్న ప్రజల అభిప్రాయం.



టంకశాల అశోక్



**క**రీంనగర్ సభలో ఈ నాలుగు అంశాల ప్రాతిపదికగా రాష్ట్ర ప్రజలకు విషయ వివరణ చేయటంతో పాటు మరొక ముఖ్యమైన పని కూడా చేయగలిగితే మరింత ప్రయోజనకరంగా ఉండవచ్చు. అది, కరీంనగర్‌లో 2001లో జరిగిన మొదటిసభలో పార్టీ లక్ష్యాలు, ఆశయాలు ఏమిటో చెప్పిన విధంగా, అప్పటినుంచి 23 ఏండ్లు గడిచిన తర్వాత నిర్వహిస్తున్న ఈ కీలకమైన సభలో ఆయా లక్ష్యాలను, అప్పటినుంచి ముందుకువచ్చిన కొత్త విషయాలను, అప్పటితరంతో పాటు కొత్త తరాలకు తెలియజేసి మరొకమారు ఉత్తేజపరచటం. దీనినే మరొక మాటలో వివిధ విషయాలపై మౌలికంగా పార్టీ దృక్పథం, ఫిలాసఫీ అనవచ్చు. ఇటువంటిది ఏ రాజకీయ పార్టీకైనా అవసరమని తెలిసిందే. కాగా, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ ఫెడరలిస్టు పార్టీకి మరింతగా అవసరం.

> దేశంలోని ఇటువంటి ఫెడరలిస్టు పార్టీలన్నింటికి తప్పనిసరి అవసరం. అవి ప్రాంతీయ ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలను పరిరక్షిస్తూ, అటువంటి సామాజిక, రాజకీయ శక్తులకు ప్రాతినిధ్యం వహించాలి గనుక. ఆ క్రమంలో, కేంద్రీకరణ శక్తులను, అవి ప్రాంతీయ ప్రయోజనాలకు, ప్రాంతీయ శక్తులకు భంగం కలిగించేవాటిని ఎదుర్కొని నిలబడవలసి ఉంటుంది గనుక.

మొదటి పేరాలో ప్రస్తావించిన నాలుగు అంశాలు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుంటూ చెప్పుకొన్నవి. వాటిలోని మొదటి రెండింటి పరిస్థితి మునుముందు కాలాన్ని బట్టి మారవచ్చు. మూడవది పార్టీని రాగల కాలంలో ఏ విధంగా బలోపేతం చేయగలరన్నదానిపై ఆధారపడి ఉంటుంది. నాల్గవది చిరకాలం నిలిచిపోయే ప్రజాభిప్రాయం. అవి అట్లుండగా ఇప్పుడు చెప్పుకొన్న పార్టీ లక్ష్యాలు, ఆశయాలు, ఫెడరలిస్టు ఫిలాసఫీ, వాటితో పాటు సెక్యులరిస్టు విలువలన్నవి బీఆర్ఎస్‌కు పునాదుల వంటివి అవుతాయి. పునాది ఎంత పటిష్టంగా ఉంటే నిర్మాణం అంత పటిష్టం, దీర్ఘకాలికమవుతుందని అందరికీ తెలిసిన విషయమే. ఆ లక్షణాలు గల పునాది, నిర్మాణాలు భూకంపాలతో సహా ఎటువంటి ఒడిదుడుకులనైనా తట్టుకొని నిలబడగలవు. అందుకే మొదటి నాల్గింటికన్న ఇది మౌలికం, దీర్ఘకాలికం అవుతున్నది.

కరీంనగర్ సభావేదిక ఫిలాసఫీ ప్రసంగాలకు తగిన సందర్భం కాదన్నది నిజమే. అక్కడ మొదట పేర్కొన్న నాలుగు అంశాల చుట్టే ప్రసంగాలు తిరుగుతాయి. దానితో పాటు, ఇవి లోక్‌సభ ఎన్నికలు అయినందున వాటిలో బీఆర్ఎస్ గెలవటం తెలంగాణ ప్రయోజనాలకు ఏ విధంగా అవసరం? ఎన్నికలు ఏవైనా అవి తెలంగాణ ప్రయోజనాలతో ఎట్లా ముడిబడి ఉంటాయి? కాంగ్రెస్, బీజేపీల వంటి జాతీయ పార్టీలు ఏ విధంగా మొదటినుంచి కూడా రాష్ర్టాలను, వాటి ఫెడరల్ హక్కులను, ప్రాంతీయ ప్రయోజనాలను అణచివేస్తూ కేంద్రీకరణ శక్తులకు లాభం చేస్తున్నాయి? తమ ఢిల్లీ అధికారం కోసం ప్రాంతాలను ఎట్లా ఉపయోగించుకుంటున్నాయి? నిజానికి తెలంగాణ రాష్ట్ర కోరికకు, ఉద్యమానికి, త్యాగాలకు ఏ విధంగా ఈ పరిస్థితులు కూడా ఒక ముఖ్య కారణం? అనే విషయాలు తెలంగాణకు చెందిన పాత, కొత్త తరాల వారి దృష్టికి బలంగా మరొకసారి తీసుకుపోవటం కూడా ఒక తప్పనిసరి అవసరం.

ఆ విధంగా మొదటి నాలుగు అంశాలు, ఈ ఐదవ అంశం పడుగు పేకల వలె కలిసి సాగాలి. అది ఎంత జరిగితే తెలంగాణ స్ఫూర్తి, ఫెడరల్ స్ఫూర్తి అంతగా రూపుదిద్దుకుంటుంది. అందువల్ల ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భానికి గాని, మునుముందు కాలానికి గాని కలిగే ప్రయోజనమేమిటో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. చివరగా ఒక్క మాటలో చెప్పాలంటే ఆ విధంగా బీఆర్ఎస్ అర్థవంతం, ఆరోగ్యవంతం, సుస్థిరం, దీర్ఘకాలికమవుతుంది.

ఇప్పుడు, పైన మొదటిపేరాలో పేర్కొన్న నాలుగు అంశాలను కొద్దిగా చర్చిద్దాం. మొదటిది హామీల అమలు. మిగిలిన వాటికన్న ముఖ్యంగా ప్రజల మనస్సులో మెదిలేది హామీల అమలు. అవి వారి జీవితాలకు ప్రత్యక్షంగా సంబంధం కలవి గనుక. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వందల కొద్ది హామీలున్నప్పటికీ వారు ప్రత్యేకంగా నొక్కి చెప్పి విస్తృతంగా ప్రచారం చేసిన 6 గ్యారెంటీలపైనే ప్రస్తుతానికి అందరూ దృష్టి పెట్టారు. అవి స్థూలంగా 6 అయినప్పటికీ వాటిలో భాగంగా, మొత్తం 13 గ్యారెంటీలున్నాయి. ఇంకా చెప్పాలంటే ఈ 13లో చేర్చకపోయినా ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పదే పదే రైతులకు తేదీ గడువుతో పాటు ఇచ్చిన మరొక హామీ డిసెంబర్ 9 నాడే రూ.2 లక్షల రుణమాఫీ. ఆ విధంగా మొత్తం 14 హామీలయ్యాయి. మొదటి 13కు 100 రోజుల గడువు వారు నిర్ణయించుకున్న ప్రకారమే ఈ నెల 17వ తేదీతో ముగుస్తుంది. వాటిలో కేవలం 2 పూర్తిగా అమలుకు తేగా, 3 మ్యానిఫెస్టోలో చెప్పినట్టు కాకుండా అరకొరగా ప్రారంభించారు. తక్కినవాటి జాడలేదు. 100 రోజుల గడువులో 94 రోజులు తీరిపోగా ఇక మిగిలింది కేవలం 6 రోజులు.

గమనించదగినది ఏమంటే ప్రస్తుతం ప్రజలు ఈ హామీల గురించి మాట్లాడుతూనే అంతకన్న ముఖ్యంగా పంటలకు, తాగేందుకు నీళ్ల , విద్యుత్తు సరఫరా గురించి అంతటా చర్చిస్తున్నారు. ఎందుకన్నది వివరించనక్కరలేదు. ఆ దృశ్యాలు అంతటా, అందరికీ కనిపిస్తున్నవే. వీటన్నింటితో పాటు ప్రజల నోళ్లలో బాగా నలుగుతున్నవి మరికొన్ని ఉన్నాయి. అవి, ఆటో రిక్షా వారి ఇక్కట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లు ఆగిపోవటం, తులం బంగారం ప్రస్తావనలు లేకపోవటం, రైతుబంధు అస్తవ్యస్తంగా మారటం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లను ఎటువంటి సంకోచ బిడియాలు లేకుండా తమవిగా చెప్పుకోవటం, అప్పటిదే అయిన ఆరోగ్యశ్రీ బీమా హెచ్చింపును కూడా తమదే అనటం వంటివి. అంతటా ప్రజలు మరొకటి కూడా మాట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ గెలిచి వచ్చిన తర్వాత చేయవలసిన పనులపై దృష్టి కేంద్రీకరించటానికి, పరిపాలనను సుస్థిరపరచటానికి బదులు అసెంబ్లీలో, బయట కూడా నిత్యం కేసీఆర్‌ను దూషించటమే ఒక కార్యక్రమంగా పెట్టుకోవటం. ఇవేవీ ప్రజలు మెచ్చటం లేదు. పరిస్థితి 100 రోజులలోనే ఈ విధంగా ఉన్నప్పుడు మునుముందు సంగతేమిటనే ప్రశ్న కూడా వారి మధ్య వస్తున్నది. వీటన్నింటి మధ్య వారికి కేసీఆర్ గుర్తుకురావటం మొదలైంది. ఇటువంటి నేపథ్యంలో కరీంనగర్ సభలో కేసీఆర్‌కు సభికులతో, ఆ ప్రసారాన్ని చానళ్లలో చూసే బయటి ప్రజలకు మధ్య మరొకసారి ప్రత్యక్షమైన కనెక్టివిటీ ఏర్పడగలదు. కృష్ణా ప్రాజెక్టుల విషయమై నల్లగొండ సభ సందర్భంగా ఏర్పడిన కనెక్టివిటీ ఆ నిర్దిష్ట అంశానికి సంబంధించినది కాగా, ఇప్పుడు కరీంనగర్‌లో అది సమస్త అంశాలను చుట్టగలదని భావించవచ్చు.

> ఈ మూడు నెలల కాలంలో ప్రజలు గమనించిన మరొక అంశం అధికారపక్షం వారు బీఆర్ఎస్‌పై, వ్యక్తిగతంగా కేసీఆర్‌పై సాగించిన నిరంతర దాడి త్వరలోనే తేలిపోవటం. పైగా, గత పాలనలో జరగలేదన్నవి అనేకం వాస్తవానికి జరిగినట్లు ప్రజలకు తమ అనుభవం ద్వారా తెలియటం. చేసిన అనేక ఆరోపణలు బీఆర్ఎస్ సభ్యుల వివరణలు, వాదనల ముందు గాలికి దూదిపింజల వలె ఎగిరిపోవటం. చివరికి మేడిగడ్డ అంశం కూడా కాంగ్రెస్ స్వయంగా చేసిన రెండు దోషాల వల్ల ప్రజల దృష్టిలో పలచబడిపోయింది.

ఒకటి, కుంగిన మూడు పిల్లర్లు, అన్నారం, సుందిళ్ల సీపేజీలపై సత్వరమే నిపుణులతో పరిశీలన చేయించి మరమ్మతులు జరిపి నీరిచ్చే అవకాశం కోసం ప్రయత్నించటానికి బదులు ఆరోపణలతో కాలక్షేపం చేయటం, మూడు నెలలు గడిచినాక గాని ఎన్‌డీఎస్‌కు పూర్తిస్థాయిలో అప్పగించకపోవటం మొదటి దోషం. మరొకవైపు రబీ పంటలు పొలం మీద ఉండి నీళ్లురాక ఎండుతూ రైతులు అల్లాడిపోతుండగా, అటు దృష్టి పెట్టి ఏమీ చేయక నీళ్లివ్వలేమంటూ చేతులు ఎత్తివేయటం. కేసీఆర్ కాలంలో ఇటువంటి సమస్య ఎన్నడూ రాలేదని, ఆయన ఇప్పుడు ఉండి ఉంటే ఏదో ఒకటి చేసి నీరు ఇవ్వగలిగేవారని రైతులు భావించటం. ఈ నిష్క్రియాపరతలు ప్రభుత్వపు రెండవ దోషం. కరీంనగర్ సభలో ఇవన్నీ సహజంగానే చర్చకువస్తాయి. ప్రజలకు మరింత స్పష్టతనిస్తాయి.

పైన చెప్పుకున్న మూడవ అంశం, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పార్టీ జరిపిన సమీక్షలు. అందుగురించి ఇక్కడ మనం చర్చించేదంటూ లేదు గాని, ఆ సమీక్షల ద్వారా గ్రహించిన విషయాలు పార్టీ నాయకత్వం దృష్టిలో ఉంటాయి గనుక ఆ సారాంశాలు కరీంనగర్ సభ నిర్వహణలో, ప్రసంగాలలో ప్రతిఫలించగలవని భావించవచ్చు. చివరి అంశం వ్యక్తిగతంగా కేసీఆర్ నాయకత్వ స్థాయి, వివిధ విషయాలపై అవగాహనలు, నిబద్ధతలు, అంతటి ప్రతిష్ఠ గల మరొక నాయకుడు ఎవరూ ఏ పార్టీలోనూ ప్రజలకు కన్పించకపోతుండటం. ఈ వ్యత్యాసాలు మునుపు కూడా ఉండేవని వారికి తెలుసు. ఆ తేడా ఇప్పుడు మరింత కొట్టవచ్చినట్టు కనిపించటం మొదలైంది. కరీంనగర్ సభ సందర్భంగా ప్రజల స్పందనల రూపంలో ఇది మనం చూడవచ్చు.

బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తు చరిత్రాత్మకం. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే కేసీఆర్‌తో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జతకలిశారు. నిజం అంత తొందరగా, సులువుగా అర్థం కాదు. ఐన్‌స్టీన్ చెప్పినట్టు.. విశ్వంలో యూనివర్సల్ సత్యం గానీ, అసత్యం గానీ ఉండవు. ప్రతిదీ సాపేక్షంగానే ఉంటుంది. తెలంగాణ పడక కుర్చీ మేధావులారా.. ఆర్ఎస్పీ-కేసీఆర్ దోస్తీని కూడా సాపేక్షంగానే చూడాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు వ్యతిరేకమా? అనుకూలమా? అనేదే అసెంబ్లీ ఎన్నికల ఎజెండా. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలా? కొనసాగించాలా? అనేదే ప్రస్తుత చర్చ. మతం పేరుతో రెచ్చగొడుతూ, రాజ్యాంగాన్ని మార్చాలనే లక్ష్యంతో బీజేపీ ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నదనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రజాస్వామికవాదుల పాత్ర ఎలా ఉండాలి? ఎన్నికల్లో మన ప్రయాణం ఎటువైపు ఉండాలనేది తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# రాజ్యాంగ పరిరక్షణ కోసమే మైత్రి



డాక్టర్ పీసీ వీరస్వామి
94944 46262



**తె**లంగాణలోని బహుజనుల అస్తిత్వం కోసం ఆర్ఎస్పీ ఓ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొంతమేరకు ప్రభావం చూపింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం చూపే అవకాశం ఉన్నది. ఇది తెలంగాణ సమాజానికే కాదు, దేశ భద్రతకు, లౌకిక వాదానికి ప్రమాదకరం. భారత రాజ్యాంగాన్ని మార్చాలని బలంగా ముందుకువెళ్తున్న బీజేపీని కట్టడి చేయడం కేసీఆర్‌తోనే సాధ్యమని ఆర్ఎస్పీ విశ్వసించారు. ఎన్నికల్లో పొత్తు ద్వారానే అది సాధ్యమవుతుందని భావించిన ఆర్ఎస్పీ ఆ దిశగా కీలక అడుగులు వేశారు. ఆనాడు కాన్షీరాం తప్పటడుగులు వేశారని కొందరు నిందించారు. కానీ, కాలక్రమంలో కాన్షీరాం తీసుకున్న నిర్ణయం ఓ చారిత్రక మైలురాయిగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఆర్ఎస్పీ వేస్తున్న అడుగుల వెనుక కూడా అదే పరమార్థం దాగి ఉన్నది. ప్రజల అమాయకత్వం, విశ్వాసాలనే ఆయుధంగా చేసుకొని మతం పేరు చెప్పుకొని రోజురోజుకు బలపడుతున్న బీజేపీని కట్టడి చేయకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. మతోన్మాదంతో రెచ్చగొడుతూ దేశాన్ని విభజించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయి. ఇది మన దేశానికి ప్రమాదకరం. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన శక్తులు, పార్టీలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వేర్వేరు మార్గాల్లో వెళ్తున్నాయి. ఇది ముమ్మాటికీ పరోక్షంగా బీజేపీకి లాభం చేయడమే అవుతుంది.

లౌకిక పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్.. బాబ్రీ మసీదు కూల్చివేతను అధికారంలో ఉండి కూడా ఎందుకు అడ్డుకోలేదు? ఆనాడు జరిగిన అల్లర్లు, హత్యలు, అత్యాచారాలను నివారించేందుకు ఆ పార్టీ చేసిన కృషి ఏమిటి? పైగా నాడు జరిగిన అఘాయిత్యాలకు సంబంధించిన ఆధారాలను సమర్పించడంలోనూ విఫలమైంది. దీంతో సరైన సాక్ష్యాధారాలు లేవని సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టివేసింది. గుజరాత్, మణిపూర్ ఘటనల్లో కాంగ్రెస్ పార్టీ లౌకికవాదం ఏమైంది? ముస్లింలు, క్రైస్తవులపై జరిగిన దాడుల విషయంలోనూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరినే అనుసరించిందనేది చరిత్ర చెప్తున్న సత్యం.

> వీర తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన రోజుల్లో కూడా మట్టి మనుషులు, దళిత, గిరిజన, బహుజనుల అణచివేతకు కాంగ్రెస్, బీజేపీలు రజాకార్లకు, బ్రిటిష్‌వారికి మద్దతుగా నిలిచిన చారిత్రక సత్యం మన ముందున్నది. ఈ సత్యాలు కాన్షీరాంకు తెలుసు, ఆర్ఎస్పీకి తెలుసు. అందుకే వారి అడుగులు బహుజన సమాజం వైపు పడ్డాయి. అందుకు మాయావతి చేయూతనిస్తున్నారు.

బహుజనవాదాన్ని వదిలేస్తే కేంద్ర, రాష్ట్ర మంత్రి కావడం ఆర్ఎస్పీకి పెద్ద కష్టం కాదు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అట్టడుగుకు నెట్టివేసిన కులంలో జన్మించిన ఆర్ఎస్పీ.. ఎంతో కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి ఎదిగారు. ఎంతోమంది బహుజన బిడ్డలను శిఖరాగ్రానికి చేర్చారు. దేశంలో అన్ని వ్యవస్థలను రాజకీయ వ్యవస్థ మాత్రమే శాసిస్తున్నదనే వాస్తవాన్ని గ్రహించిన ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజా సేవ కోసం ఏడేండ్ల సర్వీస్‌ను వదిలేశారు. కాన్షీరాం, మాయావతి వారసునిగా బహుజన సమాజం కోసం పోరాడుతున్నారు. ఇప్పుడు కొంతమంది మేధావులు, నాయకులు ఆర్ఎస్పీని విమర్శిస్తున్నారు. ఆధిపత్య పార్టీలపై ఆయన ఒంటరిగా పోరాటం చేస్తున్నప్పుడు వారంతా ఎక్కడున్నారు? తాత్కాలిక ఉపశమనం కోసం ఆధిపత్య పార్టీల గొడుగు కింద తల దాచుకుంటున్నారనే వాస్తవం అందరికీ తెలుసు. అటువంటి వారి విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. సత్యాన్ని నమ్మనివారి గురించి ఆలోచించడం దండుగ.

తెలంగాణ సమాజంలో మెజారిటీలైన దళిత, గిరిజన, ఆదివాసీ, వెనుకబడిన (వెనుక వేయబడిన) వర్గాలు ఆర్ఎస్పీతో కలిసిరావాలి. బహుజనుల ఆత్మగౌరవం కోసం మరో అడుగు వేద్దాం. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు తెలంగాణ సమాజం ముందుకు రావాలి. మన రాముడు కాన్షీరాముడు. బహుజనుల ఆరాధ్యులు బుద్ధుడు, పూలే, సావిత్రీబాయి, అంబేద్కర్. వారి ఆశయాల బాటలో నడుద్దాం. ఆర్ఎస్పీ- కేసీఆర్ మైత్రిని బలపరుద్దాం.

(వ్యాసకర్త: రాజకీయ, సామాజిక విశ్లేషకులు)

# ఇంతటి మార్పు వద్దే వద్దు!

'మార్పు కావాలి- కాంగ్రెస్ రావాలి' అనే మోసపూరిత నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ సఫలమైంది. అందుకే గత పదేండ్లుగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన బీఆర్ఎస్‌ను కాదని, ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం గట్టారు. అయితే ఆ పార్టీ మూడు నెలల పాలనను చూసిన ప్రజలు 'ఇలాంటి మార్పును ఎందుకు కోరుకున్నామా' అని ఇప్పుడు నీళ్లు నములుతున్నారు. 'ఇలాంటి మార్పేనా మీరు కోరుకున్నది' అని ప్రజలను ప్రశ్నిస్తే.. కాదంటే కాదని, ఇప్పుడు పెదవి విరుస్తుండటం కాంగ్రెస్ పాలనకు నిదర్శనం.




డాక్టర్ మాచెర్ల వాణీమనోహర్

**'మా**ర్పు.. మార్పు..' అన్న ప్రజల అభిప్రాయాల్లో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. నాటి రోజులను తల్చుకొని ప్రజలు బాధపడుతుండటం చూస్తుంటే మనసు కకావికలమవుతున్నది. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఉంటే.. నేడు ప్రజల ముఖాల్లో నవ్వులు విరబూసేవి. ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకేవి. రైతులు దుక్కిదున్ని, నాటు వేసుకోవడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యేవారు.

ఉమ్మడి పాలనలో తెలంగాణ మహిళలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని కిలోమీటర్ల మేర నడిచి వెళ్లేవాళ్లు. అలాంటి రోజులు మన ఆడబిడ్డలకు మళ్లా రావొద్దని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. అందుకే ఏండ్ల తరబడి చేసిన మేధోమథనంతో ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి వారికి విముక్తి కల్పించింది. తాగునీటి సమస్య పరిష్కారానికి పెద్దపీట వేసింది. నాటి ప్రతిపక్షాలు ఎన్నో వంకర మాటలు మాట్లాడినా పట్టించుకోలేదు. ప్రజా సంక్షేమమే తమ కర్తవ్యమని చాటిచెప్పింది. ఆ దిశగానే అడుగులు వేసింది. 'మిషన్ భగీరథ' ద్వారా ఇంటింటికీ నీళ్లందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి మహిళ మొహంలో ఆనందం చిగురించేలా చేసింది. ఇలా రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ సర్కార్ అనేక ప్రజా సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. గత పదేండ్లుగా ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన బీఆర్ఎస్ సర్కార్ స్వల్ప సీట్ల తేడాతో ప్రతిపక్షంలో కూర్చున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే గొప్పగా పనిచేస్తుందని ఊహించిన ప్రజలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. అందుకే తాము కోరుకున్నది ఇలాంటి మార్పు కాదని బల్లగుద్ది మరీ చెప్తున్నారు.

ఇదిలా ఉంటే.. దేశంలోని ఏ ప్రభుత్వమైనా పెద్ద పెద్ద బరాజ్‌లు, ఆనకట్టలు కట్టేటప్పుడు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుంది. కాంట్రాక్టర్ల పుణ్యమాని కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతాయి. ఏదైనా పొరపాటు జరిగి నష్టం వాటిల్లితే దానికి పరిష్కార మార్గాలు కనుగొని మళ్లీ ప్రభుత్వమే సరిచేయాలి. అంతేకానీ, ఆ తప్పును గత ప్రభుత్వం మీద తోసేసి ప్రజలకు నష్టం చేకూరే విధంగా వ్యవహరించడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు.

ఇతోధిక అభివృద్ధి వైపు 'మార్పు' ఉండాలి. కానీ, అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే రాష్ర్టాన్ని పదేండ్ల వెనక్కి తీసుకుపోయింది. రాష్ట్రంలో తాగునీటి కోసం ధర్నాలు ప్రారంభమయ్యాయి. మహిళలు బిందెలు పట్టుకొని రోడ్డెక్కుతున్నారు. ఓ వైపు పొలాలు ఎండిపోతుంటే, వాటిని సూడలేక రైతులు సాగునీటి కోసం విన్నపాలు ఇచ్చే దుస్థితి దాపురించింది. రాష్ట్రంలో ఇంతటి మార్పు చూస్తామనుకోలేదని ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తేరుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రజల బాగోగులకు ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగించాలి. ఆ దిశగా పాలకులకు సద్బుద్ధి కలగాలని ఆకాంక్షిద్దాం.




## ఎస్‌బీఐ ఏదో దాస్తున్నది!

ఎన్నికల బాండ్లు ఓ కుంభకోణం. ఆ పథకంలో ఎన్నో అవకతవకలు జరిగాయి. దానివల్ల ఏ పార్టీ ఎక్కువగా లాభపడిందో తేలాలి. ఎస్‌బీఐ ఏదో దాచాలని చూస్తున్నది. ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం శుభపరిణామం.

**- ఒమర్ అబ్దుల్లా,**
జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి